క్లుప్తంగా

క్రాస్‌కంట్రీ పోటీలకు కేవీఆర్ విద్యార్థి ఎంపిక



నందిగామటౌన్: అఖిల భారత విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రీ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు నందిగామ కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రాయప్ప శనివారం తెలిపారు. బెంగుళూరులోని మంగళూరు యూనివర్శిటీలో ఈనెల 18 నుంచి 20వరకు జరగనున్న క్రాస్ కంట్రీ (10కి.మీల పరుగు పందెం) పోటీలకు కళాశాలకు చెందిన పవన్ కుమార్ కృష్ణ ఎంపికైనట్లు ఆయన వివరించారు. అనంతరం పవన్‌కుమార్‌కృష్ణను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఎర్రంరెడ్డి బాబురావు, వాసిరెడ్డి గోపాలకృష్ణ మూర్తి, వాసిరెడ్డి నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోరు పంపునకు మరమ్మతులు




కంచికచర్ల : మండలంలోని గండేపల్లి బీసీ కాలనీలోని బోరుపంపు మరమ్మతులకు గురికావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బోరు పంపునకు శనివారం సర్పంచి బొక్కా రవికుమార్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. సర్పంచి మాట్లాడుతూ రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా ప్రతి రోజు గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తున్నామన్నారు. గ్రామస్తులకు మంచినీటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతోపాటు తగిన రక్షణ చర్యలు లేకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని జగన్నాథపురం, రంగాపురం, జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, జయంతి, వీరులపాడుతోపాటు ఆయా గ్రామాల్లోని రోడ్ల పక్కన..పాఠశాలల సమీపంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజ్‌బాక్స్‌లు తక్కువ ఎత్తులో ఉండటంతో ఆయా రోడ్లలో వెళ్లే వాహనచోదకులు, ప్రజలు ప్రమాదాలు చోటుచేసుకుంటాయోమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్



నందిగామటౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కోశాధికారి పంతంగి శ్రీనివాసరావు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 21న మచిలీపట్నం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. డిశంబరు 10 వరకు ఆయా డివిజనల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏజెంట్ల కమిషన్‌ను యథావిధిగడా కొనసాగించాలని, రూ.లక్ష పాలసీలు ఉంచాలని, ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎల్ఐసీ ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఐసి చైర్మన్ క్లబ్ సభ్యులు రామిరెడ్డి శ్రీధర్, పురంశెట్టి రామారావు, ప్రజాసంఘాల నాయకుడు ఆకుల నారాయణ, ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

మద్యం ప్రియుల జేబులకు చిల్లు

- నందిగామ నియోజకవర్గంలో భారీసంఖ్యలో బెల్టుషాపులు..
- క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.50వసూలు
- అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న మద్యం విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ





కంచికచర్ల మండలంలో కొనసాగుతున్న ఓ మద్యం బెల్టుషాపు

కంచికచర్ల: నూతన మద్యం పాలసీ కారణంగా మద్యం ధరలు తగ్గడం అటుంచి మద్యంప్రియుల జేబులకు మాత్రం భారీగా చిల్లుపడుతోంది. ఆయా గ్రామాల్లో వెలిసిన మద్యం బెల్టుషాపుల కారణంగా నందిగామ నియోజకవర్గంలో మద్యం విక్రయాలు కూడా భారీగా పెరిగాయి. బెల్టుషాపుల్లో తెల్లవారుజాము నుంచే ప్రారంభమవుతున్న మద్యం విక్రయాలు అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. లాటరీ ద్వారా మద్యం షాపులను దక్కించుకున్న వారు బెల్టుషాపులకు మద్యాన్ని సరఫరా చేస్తూ సేల్స్ పెంచుకుంటుండగా, బెల్టుషాపులను నియంత్రించాలని ఎక్సైజ్ అధికారులు మాత్రం నిద్రనటిస్తున్నారు. అడపాదడపా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారే తప్ప బెల్టుషాపులను మాత్రం నియంత్రించలేకపోతున్నారు.

పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు..

నందిగామ నియోజకవర్గంలో పుట్ట గొడుగుల్లా మద్యం బెల్టుషాపులు వెలిశాయి. గత ప్రభుత్వం బెల్టుషాపులకు లేకుండా చేయగా, ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వంలో మాత్రం పరిస్థితి మూడు మద్యంషాపులు..ముప్పై ఆరు బెల్టుషాపుల్లా మారింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 154 మద్యం బెల్టుషాపులు ఉండగా, కంచికచర్ల మండలంలో 54, నందిగామ మండలంలో 55, వీరులపాడు మండలంలో 25, చందర్లపాడు మండలంలో 20 మద్యం బెల్టుషాపులు ఉన్నాయని సమాచారం. కూటమి పార్టీ అధికారంలోకి వచ్చాక టీడీపీ కార్యకర్తలే ఎక్కడబడితే అక్కడే బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు.

బాటిల్‌పై అదనంగా రూ.50వసూలు..

మద్యం ప్రియులకు తెల్లవారుజాము నుంచే బెల్టుషాపుల్లో మద్యం దొరుకుతోంది. అయితే ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు.

ఒక్కో బెల్టుషాపు నిర్వాహకుడు రోజుకు సగటున రోజుకు ఓ కేస్ (48 క్వార్టర్ బాటిళ్లు)కుపైగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు బెల్టుషాపుల నిర్వాహకులంతా కలిసి మందుబాబుల నుంచి రూ.3.69లక్షలకుపైగా అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా నెలకి రూ.1.10కోట్లు మద్యంప్రియుల నుంచి బెల్టుషాపుల నిర్వాహకుల జేబుల్లోకి వెళ్తోంది.

ప్రోత్సహిస్తున్న మద్యంషాపుల నిర్వాహకులు..

మద్యం సేల్స్ పెంచుకునేందుకు మద్యంషాపుల నిర్వాహకులు బెల్టుషాపుల సంఖ్య మరింత పెరిగేలా చూసుకుంటున్నారు. మద్యంషాపు కోసం ప్రభుత్వానికి భారీగా చెల్లిస్తున్న ఫీజు, షాపు నిర్వహణ ఖర్చులు, ఎక్సైజ్‌శాఖతోపాటు అధికారపార్టీ రాజకీయనేతలకు చెల్లించాల్సిన నెలవారీ ముడుపుల ఖర్చులన్నింటినీ తట్టుకోవాలంటే బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు పెంచుకుంటున్నారు. ఇక ఈ బెల్టుషాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం అటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పత్రికల్లో వార్తలు వచ్చినపుడు తూతూమంత్రంగా ఒకట్రెండు బెల్టుషాపులపై దాడులు చేయడం ఆ తర్వాత మిన్నకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపుల నుంచి నెలవారీ మామూళ్లు అందుతుండమే ఇందుకు కారణమని మద్యంప్రియులు బహిరంగంగానే చర్చించుకుంటుండటం గమనార్హం. ఇకనైనా నందిగామ నియోజకవర్గంలోని మద్యం బెల్టుషాపులను నియంత్రించాల్సి బాధ్యత ఎక్సైజ్‌శాఖ అధికారులపై ఉంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో బెల్టుషాపులు లేవు

కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ పరిధిలో కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ప్రభుత్వ అనుమతితో మొత్తం ఏడు మద్యం దుకాణాలు మాత్రమే ఉన్నాయి. మా కార్యాలయ పరిధిలో ఒక్క బెల్టుషాపు కూడా లేదు. దొంగచాటుగా మద్యం విక్రయిస్తున్న వారిని గుర్తించి పట్టుకుని కేసు నమోదు చేస్తున్నాం.

షేక్ అఫ్రపునీసాబేగం, కంచికచర్ల ఎక్సైజ్ సీఐ

19 నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

నందిగామటౌన్: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను ఈనెల 19 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. స్థానిక సత్యసాయి ఆలయం వద్ద శనివారం వారు మాట్లాడుతూ ఈనెల 19న ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, జ్యోతి ప్రజ్వలన, స్వామివారి పాదులకు అభిషేకం, ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 20న మంగళ హారతి, వేద పఠనం, 21న 99మందికి దుప్పట్ల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు, 22న వ్యాసరచన పోటీలు, 23న స్వామివారికి 99 జ్యోతులు వెలిగించుట, నగర సంకీర్తన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి రథోత్సవం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ప్రతినిధులు వాసుదేవరావు, సరికొండ రవీంద్ర, పాల్గొన్నారు.

వయోజన విద్యపై అవగాహన

నందిగామటౌన్: చదువుకు వయసుతో సంబంధం లేదని ఏ వయసు వారైనా చదువుకోవచ్చని ఎంఈవో పద్మ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో పద్మ మాట్లాడుతూ 15ఏళ్లకు మించి వయసున్న వారిని గుర్తించి వారు చదువుకునేలా అవగాహన కల్పించాలని డ్వాక్రా సంఘాల అధ్యక్షులకు సూచించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యా వలంటీర్‌లకు శిక్షణనిస్తున్నట్లు వివరించారు. అనంతరం ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం రవీంద్ర, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు





జగ్గయ్యపేట గాంధీపార్కులో గన్ని బ్యాగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా శనివారం స్థానిక గాంధీ పార్కులో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గన్ని బ్యాగ్ పోటీలు నిర్వహించగా, 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు జెడ్పీ బాలుర హైస్కూల్ పీడీ ఎం.సొడానాయక్, జెడ్పీ బాలికల హైస్కూల్ పీడీ ఎల్.సరోజ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సాహితీ కార్యక్రమంలో భాగంగా కవి, ఉపాధ్యాయుడు బత్తుల బ్రహ్మయ్య పాల్గొని తెలుగు సాహిత్యంలో జాషువా పద్య పరిమళం అనే అంశంపై ప్రసంగించారు. సమాజంలో తాను ఎదుర్కొన్న సంఘటనలను పద్యరూపంలో వివరించారన్నారు. తన రచనల ద్వారా సమాజ చైతన్యం కోసం కృషిచేశారని కొనియాడారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సాహితీవేత్తలు దోసపాటి నాగేశ్వరరావు, వడ్డె శ్రీను, అద్దంకి సుధాకర్, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, నాగమల్లిక, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కొణకంచి(వత్సవాయి): వారోత్సవాల్లో భాగంగా పెనుగంచిప్రోలు మండలంలోని కొణకంచి గ్రంథాలయం శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తకప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, నాగభూషణం చేసిన సేవలను కొనియాడారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆశ కార్యకర్తలతో సమావేశం

కంచికచర్ల: గ్రామాల్లో మాతా శిశుమరణాలు అరికట్టేలా వైద్యసేవలు విస్తృతం చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు కె.మధురిమ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, , బాలింతలకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించి అవసరమైన మందులు ఉచితంగా అందజేయాలన్నారు. రోగాల బారిన పడిన వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. బీపీ, సుగర్ వంటి పరీక్షలు చేయాలని, జ్వరాలు ఉన్నట్లయితే సమీపంలోని పీహెచ్‌సీలకు తీసుకురావాలని ఆశవర్కర్లకు సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో శానిటేషన్ పనులు జరిగేలా చూడాలని అన్నారు. సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో సంఘ్ నేత రాఘవయ్య ప్రచారం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో యూనియన్ల గుర్తింపు ఎన్నికల ప్రచారం కోలాహలంగా జరిగింది. ఎన్ఎఫ్ఐఆర్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరుగనున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో రైలింజన్ గుర్తుకు ఓట్లు వేసి ఎంప్లాయీస్ సంఘ్‌ను గెలిపించాలని కార్మికులను ఆయన కోరారు. ఆయన మాట్లాడుతూ రైల్వేలో నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) రద్దు చేయించి పాత పెన్షన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) అమలు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో మోసాలకు అడ్డుకట్ట



కంచికచర్లలో జూమ్ మీటింగ్‌కు హాజరైన పోలీసు అధికారులు, బ్యాంకు మేనేజర్లు, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్లు, పోలీసులు

జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు

కంచికచర్ల: డిజిటల్ మోసాల విషయంలో బ్యాంకు ఉద్యోగులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సూచించారు. డిజిటల్ మోసాల నివారణపై నందిగామ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, పోలీసులకు శనివారం కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు జూమ్ ద్వారా సదస్సునుద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చన్నారు. సైబర్‌నేరాలకు పాల్పడేవారు అన్ని వయస్సుల వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. మీ మొబైల్ నంబర్ చట్ట విరుద్ధ కార్యకలాపాలకు లింక్ చేయబడిందని, నిషిద్ధ వస్తువులతో కూడిన పార్శిల్ మీపేర వచ్చిందని, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ విచారణ పేరుతో ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారన్నారు. పోలీసులు ఆన్‌లైన్ విచారణలు చేయరని, డిజిటల్ విచారణలు ఉండవని ప్రజలంతా గుర్తించుకోవాలన్నారు. ఆన్‌లైన్ లింక్‌ల ద్వారా బ్యాంకు ఖాతాల కేవైసీ అప్‌డేట్ అడిగితే నమ్మవద్దన్నారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు. అధిక రాబడి పథకాల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు జరిగిన తర్వాత దర్యాప్తు చేసేకంటే, ముందస్తు జాగ్రత్త చర్యల ద్వారా ఆయా నేరాలను అరికట్టడం మేలన్నారు. సైబర్ నేరానికి గురైన గంటలోపు టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఫిర్యాదు చేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. మాదక ద్రవ్యాలు, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ పోలీసు అధికారుల్లా నటిస్తూ డబ్బులు గుంజేందుకు యత్నించేవారి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా కస్టమర్ కంగారుగా వచ్చి ఇతర రాష్ట్రాలకు చెందిన బ్యాంకు ఖాతాలకు సేవింగ్ అకౌంట్ నుంచి భారీ మొత్తంలో నగదు బదిలీ చేయాలని కోరినపుడు బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై పోలీసువారి ప్రశ్నావళిని వారికి వివరించి అనంతరం ఆయా వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. తద్వారా సైబర్ నేరాల బారి నుంచి ప్రజలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీపీ గౌతమిషాలి, క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, డీసీపీ మహేష్‌రాజు, నందిగామ ఏసీపీ తిలక్, నందిగామ రూరల్, నందిగామ, జగ్గయ్యపేట సీఐలు, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలు, ఏడు మండలాల ఎస్ఐలు, బ్యాంకు మేనేజర్లు, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

లక్ష గాజులతో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ



లక్ష గాజుల అలంకరణలో జగ్గయ్యపేట శ్రీనాగ లక్ష్మి అమ్మవారు



శ్రీనాగలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కోలాట నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న విద్యానగర్ వాసులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని 12వవార్డు, రైల్వేకట్ట అవతల ఉన్న శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే అమ్మవారికి పంచామృతాలతో పాలాభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, శ్రీసూక్త పారాయణం, లక్ష్మీగణపతి హోమము, రుద్రహోమము నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పాలుపొంగళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు మార్తి సాంబ మూర్తిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధరకాల పూలతోపాటు లక్ష గాజులతో అలంకరించారు. ఆయా రాజకీయపార్టీలకు చెందిన నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంట్ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

కుక్కకాటు బాధితులకు పరామర్శ



కుక్కకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శిస్తున్న వట్టెం మనోహర్, జగదీష్

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ అనేకమందిని గాయపరుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం నివారణ చర్యలు తీసుకోవడం లేదని మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్,, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్ ఆవేదన వ్యక్తంచేశారు. వీధి కుక్కల దాడికి గురై స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం వారు పరామర్శించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ వీధి కుక్కల దాడిలో ఇటీవల పెనుగంచిప్రోలులో ప్రేమకుమార్ అనే రెండేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోవడం బాధకరమన్నారు. జగ్గయ్యపేటలో శనివారం పలువురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయన్నారు. శనివారం ఒక్కరోజే 25మంది కుక్కకాటుకు గురై ప్రభుత్వాస్పత్రికి వచ్చారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. కుక్కల సమస్యపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, అధికారులు తగు చర్యలు చేపట్టి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలన్నారు. జగదీష్ మాట్లాడుతూ శనివారం బుద్ద విహార్ ఎదురుగా ఎస్.కామేశ్వరి అనే 14నెలల చిన్నారిని కుక్కలు ఈడ్చుకుంటూ వెళ్తుండగా స్థానికులు చూసి కాపాడారని వివరించారు. ఇకనైనా పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వారివెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరాజ్ ఉన్నారు.

హక్కులను పణంగా పెట్టొద్దు

సీఐడీ ఏఎస్పీ ప్రసాద్



ఎస్సీ, ఎస్టీ హక్కులపై అవగాహన కల్పిస్తున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ దేవరకొండ ప్రసాద్

వీరులపాడు: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని సీఐడీ అడిషనల్ ఎస్పీ దేవరకొండ ప్రసాద్ సూచించారు. మండలంలోని రంగాపురం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ హక్కులపై సీఐడీ ఆధ్వర్యంలో తండావాసులకు శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవరకొండ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తమ హక్కులను మాత్రం పణంగా పెట్టవద్దని సూచించారు. ముఖ్యంగా గిరిజనులు, ఎస్సీలు తమ హక్కుల విషయంలో నిబద్ధతతో నడుచుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎంతటి సమస్యనైనా సులువుగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ కోటి, తహసీల్దార్ హుస్సేన్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ, పౌర సరఫరాలశాఖ ఏఎస్‌వోలు రంగారావు, లక్ష్మణ్‌బాబు, ఎంపీడీవో అరుంధతీదేవి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బట్టపర్తి రాజు, అనిల్‌కుమార్, రాంబాబు, రామరాజు, సీఐ చౌహాన్, ఎస్ఐ అనిల్, అధికారులు పాల్గొన్నారు.

500 భగవద్గీత పుస్తకాలు పంపిణీ



గంపలగూడెం: భగవద్గీత చూపిన మార్గం ప్రతి ఒక్కరూ పాటించాలని సమరసత సేవా ఫౌండేషన్ గంపలగూడెం మండల కన్వీనర్ వనమా సుజాత అన్నారు. గంపలగూడెం లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్లో 500 మంది విద్యార్థులకు శనివారం భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ భగవద్గీతలోని 18 అధ్యాయాల సారాంశంతో విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ ఈ పుస్తకాలను ముద్రించిందని వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే భగవద్గీత విశిష్టత తెలుసుకుంటే మంచి నడవడిక ఏర్పడుతుందని చెప్పారు. సంస్థ ప్రతినిధులు బొడ్డు సత్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.